సాక్షి మంచిర్యాల

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ఆర్టీసీలో అద్దె బస్సుల హవా

ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరిగిపోతోంది. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా, పాత బస్సులు నడపకుండా సంస్థ అద్దె బస్సులపైనే ఆధారపడుతోంది. 8లో▸

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ



జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు దాడులకు దారితీశాయి. బెల్లంపల్లిలో ఆ పార్టీ లోని రెండు వర్గాల శ్రేణులు బుధవారం రెచ్చిపోయారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.4 /18.2

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగలు ఎండతీవ్రత అధికమవుతుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

విప్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్



బాల్క సుమన్‌తో చైర్మన్, వైస్ చైర్మన్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, బైంసా ప్రభాకర్ ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో విప్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌కు బాల్క సుమన్ శుభాకాంక్షలు తెలిపారు.

పీఏసీఎస్ సీఈవో తొలగింపు

చెన్నూర్: చెన్నూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశంలో చైర్మన్ చల్లా రాంరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో రుణాల మంజూరు, రుణాల వసూళ్లపై చర్చించారు. చైర్మన్ అనుమతి లేకుండా సెలవులపై వెళ్లిన సీఈవో రత్న లక్ష్మారెడ్డిని తొలగిస్తూ పాలకవర్గం తీర్మానం చేసింది. అనంతరం అసిస్టెంట్ సీఈవోగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి సీఈవోగా నియమించారు. లక్ష్మారెడ్డికి కంప్యూటర్ ఆపరేటర్ బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఇప్ప చంద్రయ్య, డైరెక్టర్లు కాయిత రమేశ్, చెన్న రమేశ్, అయిత బాపురెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, జనగామ లక్ష్మి, మనోహరాబాయి పాల్గొన్నారు.

నీటి స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రీజినల్ కోఆర్డినేటర్ బ్రహ్మచారి

భీమారం: ప్రభుత్వం మిషన్‌భగీరథ ద్వారా అందిస్తున్న నీటి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని మహిళా సొసైటీ హైదరాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ రాజోలు బ్రహ్మచారి మహిళలకు సూచించారు. మండల కేంద్రంలో గ్రామ కోఆర్డినేటర్లకు భగీరథ నీటి స్వచ్ఛతపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు సరఫరా చేస్తోందన్నారు. ఈ నీటిపై అవగాహన లేక ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవడంలేదన్నారు. భగీరథ నీటిలో ఆరోగ్యాన్ని ఇచ్చే మినరల్స్ ఉన్నాయని తెలిపారు. గ్రామీణులకు నీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏపీఎం త్రయంబకేశ్వర్, మహిళా సంఘాల గ్రామ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 757 మంది విద్యార్థులకు 728 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 453 మందికి 423 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

‘ఓపెన్’ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: ఓపెన్‌స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్ష రాయడానికి పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ పద్ధతిన ఈనెల 23 నుంచి మార్చి 3 వరకు అపరాధ రుసుంతో చెల్లించే అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు రూ.500 ఫైన్‌తో ఇంటర్ విద్యార్థులు రూ.1000 ఫైన్‌తో చెల్లించేందుకు రాష్ట్ర డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారని పేర్కొన్నారు.

పరీక్షలు ప్రశాంతం

జిల్లాలో జరుగుతున్న డిప్లొమా ఇన్ ఎలిమంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్, ఈడీ) పరీక్షలు మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు 16 మంది 14 మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

జిల్లాలో 2023–24 విద్య సంవత్సరానికి తెలంగాణ మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి మార్చి 1 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి, 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్లకు telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూడింటిపైనే మక్కువ!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రవాణా శాఖలో కొందరు అధికారుల తీరు వివాదాస్పదమవుతోంది. తమకు అనుకూలమైనవారికి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో పోస్టింగ్ ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ మూడింటిపైనే అందరూ మక్కువ చూపుతుండడం గమనార్హం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ములో వాటా తీసుకుని పంచుకుంటున్నారనే ప్రచారమూ సాగుతోంది.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

- ఆ చెక్‌పోస్టుల్లో డ్యూటీ కోసం పోటీ
- పైరవీలతో ఆన్‌డ్యూటీ ఉత్తర్వులు
- విధుల కోసం రవాణా ఆఫీసర్ల మధ్య లొల్లి
- భోరజ్ చెక్ పోస్టులో నిలిచిన ‘మూవ్‌మెంట్’



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్‌లో రవాణా శాఖ చెక్ పోస్టు

ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ఆర్టీఏ చెక్ పోస్టులు ఉన్నాయి. అంతర్రాష్ట్ర సరిహద్దులుగా ఉన్న రహదారులైన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం 44 నంబర్ జాతీయ రహదారిపై భోరజ్ వద్ద, నిర్మల్ జిల్లా తానూరు మండలం బెల్‌తరోడా వద్ద, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రం శివారులో రవాణాశాఖ చెక్ పోస్టులు ఉన్నాయి. ఆరేళ్లుగా రాష్ట్ర రవాణా శాఖలో సాధారణ బదిలీలు చేయలేదు. కొత్త నియామకాలు కూడా లేకపోవడంతో ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఏఎంవీఐ), కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఆఫీసులో కంటే ఈ మూడు చెక్ పోస్టుల్లో పని చేసేందుకు మక్కువ చూపుతున్నారు. అయితే రెగ్యులర్, కాకుంటే ఓడీ (ఆన్‌డ్యూటీ), డిప్యూటేషన్, ఇన్‌చార్జి ఇలా ఏదో రకంగా చెక్‌పోస్టు విధుల్లో వాలిపోతున్నారు. ఇందుకోసం అధికారికంగానే ‘పైరవీ బదిలీలు’ సాగుతున్నాయి. రాజకీయ, అసోసియేషన్, ఇతర మార్గాల పైరవీలతో ఎంతైనా వెచ్చించి, ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. అలా ఉమ్మడి జిల్లాలో పలువురు అధికారులు చెక్ పోస్టు డ్యూటీల కోసం పోటీ పడుతున్నారు.

భోరజ్ చెక్ పోస్టులో ముసలం

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ప్రభుత్వానికి, ఇటు అధికారులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న భోరజ్ చెక్ పోస్టు వద్ద కొద్ది రోజులుగా డ్యూటీల కోసం రగడ నడుస్తోంది. మంచిర్యాల, ఆసిఫాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి ఓడీ ఆర్డర్లతో అక్కడ రవాణా అధికారులకు విధులు కేటాయించారు. ఇక్కడ ఏడు రెగ్యులర్ పోస్టులు కాగా, మిగిలివారంతా ఇన్‌చార్జీలే. ఎంవీఐ, ఏఎంవీఐలు కలిపి 20 మంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి నెలలో ఒకటి, అర డ్యూటీలు మాత్రమే వస్తున్నాయి. ఇటీవల ఈ డ్యూటీల కోసం ఓ సీనియర్ ఎంవీఐ, జూనియర్ల మధ్య వివాదం రాజుకుంది. ఆ సీనియర్ అధికారి తనకే ఎక్కువ డ్యూటీలు ఇవ్వాలని.. కుదరకపోతే, భారీ మొత్తంలో ముట్టజెప్తేనే ఓడీలపై వచ్చిన అధికారులను డ్యూటీలకు అనుమతిస్తామనడంతో మిగతా వాళ్లు నిరసన తెలుపుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడం, ఓ అధికారి డ్యూటీ చేయనీయకపోవడంపై పెట్రోల్ సీసాతో ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడం చోటు చేసుకుంది. ఈ వివాదంతో తమ వసూళ్ల ‘మూవ్‌మెంట్’కు ఇక ఆటంకం కలుగుతోందని ఆ అధికారులే చెప్పడం గమనార్హం.



నిర్మల్ జిల్లాలోని బేల్‌తరోడాలో చెక్ పోస్టు



ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని చెక్ పోస్టు

రూ.లక్షల్లో అనధికారిక వసూళ్లు..

24 గంటల వ్యవధిలో మూడు షిఫ్టులు(ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో) ఐదు, తొమ్మిది, పది గంటల చొప్పున డ్యూటీలు చేయాలి. విధుల్లో ఉన్న అధికారులు చెక్ పోస్టు గుండా వెళ్లే వాహనాల పర్మిట్, ఓవర్ లోడ్, లైసెన్సులు, ట్యాక్స్‌లు, రవాణా శాఖ నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయా? లేవా? చెక్‌చేసి పంపాలి. ఏవైనా సరిగా లేకపోతే జరిమానా విధించాలి. ఈ జరిమానాలు, వాహనాల పన్నులతో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. వీటితోపాటు ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు వాహనాల డ్రైవర్ల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. రోజుకు కనీసం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అనధికారిక వసూళ్లు జరుగుతాయంటే అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు సిబ్బంది, తిండి, ఇతర ఖర్చులు పోనూ, మిగతాది డ్యూటీ అధికారి జేబులోకి వెళ్తుంది. ఈ ఆదాయం కోసమే పెద్ద ఎత్తున ప్రైవేటు సిబ్బంది అక్కడ పని చేస్తుంటారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోంది. ఈ సొమ్ములో ఎవరి స్థాయిలో వారికి వాటాలు వెళ్తున్నాయి. దీంతో ఎవరూ నోరు మెదపరు. రూ.లక్షలు ఖర్చు చేసి డ్యూటీలు తెచ్చుకుని, రెట్టింపు ఆర్జన కోసం ఆరాటపడుతున్నారు.

ఓడీల పేరుతో విధులు..

మూడు చెక్ పోస్టుల్లోనూ అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా స్థానికంగా ఉన్న అధికారుల కంటే వివిధ జిల్లాల నుంచి ఆన్ డ్యూటీపై వచ్చి పని చేస్తున్నవారే ఎక్కువయ్యారు. నిర్మల్ జిల్లా బెల్‌తరోడాకు ఏడుగురిలో ఇద్దరు కరీంనగర్ నుంచి ఓడీపై వచ్చారు. మంచిర్యాల నుంచి నలుగురు ఎంవీఐలు, ఓ ఏఎంవీఐ భోరజ్ చెక్ పోస్టుకు ఓడీపై కేటాయించారు. వాంకిడిలో మరో ఏఎంవీఐకి ఆన్‌డ్యూటీ వేశారు. వాంకిడిలో పని చేస్తున్న వారిలో ఒకరు సస్పెండ్ కాగా, మిగిలిన వారిలో నలుగురు జిల్లా ఆఫీసు డ్యూటీవారు, మరో ఏడుగురు బయటి నుంచి ఓడీ, డిప్యూటేషన్‌పై వచ్చినవారే. కొందరైతే బదిలీపై వేరే చోటుకు వెళ్లి, స్వల్పకాలంలోనే తిరిగి మళ్లీ చెక్ పోస్టు డ్యూటీ తెచ్చుకుని విధులు నిర్వహిస్తున్నారు. చెక్ పోస్టు డ్యూటీ, అటూ ఆఫీసు డ్యూటీతోపాటు తనిఖీలు చేస్తున్నారు. ఇలా సిబ్బంది కొరత సాకుతో అదనపు డ్యూటీలతో అక్కడ మేమే.. ఇక్కడా మేమే అన్నట్లుగా రవాణా శాఖ అధికారుల విధులు సాగుతున్నాయి. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ రవాణా శాఖలో డ్యూటీల రగడ కొన సాగతుండడం గమనార్హం.

చిన్నారులకు టీకాలు వేయించాలి



చికెన్‌పాక్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ అతుల్

మంచిర్యాలటౌన్: వైద్యుల సూచనల మేరకు చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని స్టేట్ సర్వైలెన్స్ అధికారి డాక్టర్ అతుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లో ఓ చిన్నారికి చికెన్ పాక్స్ రాగా, వైద్య సిబ్బందితో పాటు, చిన్నారి తల్లిదండ్రులకు టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. పుట్టినప్పటి నుంచి చిన్నారులకు నిర్దిష్ట సమయాల్లో టీకాలు వేసేలా వైద్య ఆరోగ్య శాఖ అందించే చార్టును ఫాలో కావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ అనిత, డీపీహెచ్ రత్నమాల పాల్గొన్నారు.

చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలి

మంచిర్యాలటౌన్: చిన్నారులు పౌష్టికాహారం తీసుకునేలా చూసి, వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని జిల్లా టీకాల అధికారి, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత అన్నారు. పాతమంచిర్యాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువుతోపాటు, వారికి టీకాలు సక్రమంగా వేశారా లేదా అని పరిశీలించారు. చిన్నారులు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పిల్లలకు అందించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



బియ్యం పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

మందమర్రిరూరల్: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌కు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో జాడి పోచయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



జిల్లా కేంద్రంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- ఇంటింటికీ వెళ్లి గుర్తిస్తున్న వైద్య సిబ్బంది
- బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు
- గ్రామాల్లో పూర్తి, పట్టణాల్లో సాగుతున్న సర్వే

జిల్లాలో పరీక్షించిన వారు	6,93,660
బీపీ అనుమానంతో పరీక్షించింది	3,59,507
అందులో బీపీ ఉన్నట్లు గుర్తించింది	51,451
షుగర్ కోసం పరీక్షించింది	3,59,504
షుగర్ ఉన్నవారి గుర్తించింది	21,263
క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేసింది	275

క్యాన్సర్‌ను గుర్తించింది 41 మందికి (ఓరల్ 16, బ్రెస్ట్ 18, సర్వైకల్ క్యాన్సర్ 7)



వ్యాధిగ్రస్తులకు అందించే ఎన్‌సీడీ కిట్టు

మంచిర్యాలటౌన్: మనిషి తన నిత్య జీవితంలో ఎన్నో రకాల ఒత్తిడులకు గురవుతుండగా, జల, వాయు, నీటి కాలుష్యం పెరిగిపోతుంది. తినే ఆహారం కల్తీ అవుతోంది. వీటన్నింటి ఫలితంగా మనిషి వయసు 40కి చేరుకవాగానే బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతోపాటు, వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నా, సమయానికి వైద్య పరీక్షలు చేసుకోకపోవడంతో వ్యాధి ముదురుతోంది. పరిస్థితులు చేయి దాటి కొంతమంది అకాల మరణాలు పొందుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను స్క్రీనింగ్ చేసి గుర్తించేందుకు ఎన్‌సీడీ సర్వేను చేపట్టింది. ప్రతినెలా వారికి సరిపడా మందులను అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అసంక్రమిత వ్యాధులు(ఎన్‌సీడీ) సర్వేలో పలువురు వ్యాధిబారిన పడ్డట్లుగా గుర్తిస్తున్నారు. ఇప్పటికే ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేసి, వ్యాధిగ్రస్తులను గుర్తించారు.

మున్సిపాలిటీల్లో సర్వే షురూ..

పట్టణాల్లో ఆశ వర్కర్లు లేకపోవడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గుర్తింపులో జాప్యం జరిగింది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో వారం రోజులుగా సర్వే చేస్తున్నారు. గ్రామాల్లోని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల సహాయంతో మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ఎంత మంది రోగులు ఉన్నారనే దానిపై సర్వే చేయగా, ప్రస్తుతం సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో సర్వే చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన హైపర్‌టెన్షన్(బీపీ), డయాబెటీస్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ బారిన పడిన రోగులను గుర్తించి, వారికి నెలకు సరిపడా ఎన్‌సీడీ కిట్ల ద్వారా మందులు అందిస్తున్నారు. సర్వేలో ఎక్కువగా బీపీ, షుగర్ ఉన్నవారిని గుర్తించగా, క్యాన్సర్ రోగులను సైతం గుర్తించారు.

బీపీ, షుగర్ బాధితులు ఎక్కువ..

ఎన్‌సీడీ సర్వేలో బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్న వారే అధికంగా ఉన్నారు. జిల్లాలో నిర్వహించిన సర్వేలో అనుమానితులు 3,59,507 మందికి టెస్టులు చేయగా, 51,451 మందికి బీపీ ఉన్నట్లు గుర్తించారు. షుగర్ అనుమానితులు 3,59,504 మందికి టెస్టులు చేయగా 21,263 మందికి షుగర్ ఉన్నట్లు గుర్తించారు. క్యాన్సర్ అనుమానితులు 275 మందికి టెస్టులు చేయగా అందులో ఓరల్ క్యాన్సర్ 16, బ్రెస్ట్ క్యాన్సర్ 18 మందికి, సర్వైకల్ క్యాన్సర్ 7 మందికి మొత్తంగా 41 మందికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు సరిపోయేలా అవసరం మేరకు బీపీ, షుగర్ మందుల కిట్లను తెప్పించి, ఒక బ్యాగులో పెట్టి రోగులకు ఇస్తున్నారు. క్రమం తప్పకుండా మందులను వాడేలా వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి సలహాలు, సూచనలను అందిస్తున్నారు.

గుర్తించిన వారికి మందులు ఇస్తున్నాం



జిల్లాలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో సర్వే పూర్తి చేశాం. పట్టణాల్లో సర్వే జరుగుతోంది. ఇప్పటికే గుర్తించిన బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను ఎన్‌సీడీ కిట్ల రూపంలో అందిస్తున్నాం. మందులు తీసుకున్న ప్రజలు క్రమం తప్పకుండా వాటిని వాడితే దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తగ్గుతుంది.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

నస్పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం ద్వారా గొర్రెల పెంపకం దారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని కలెక్టర్ సంతోష్ అన్నారు. పట్టణంలోని సీతారాంపల్లిలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత నట్టల నివారణ మందు పంపిణీని జిల్లా పశుసంర్ధక శాఖ జిల్లా అధికారి వై.రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెలకు ఈ మందు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొంది రక్తహీనత నియంత్రించబడి మరణాల సంఖ్య తగ్గుతుందని వివరించారు. 27 బృందాల ద్వారా ఈ కార్యక్రమం ఈ నెల 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ శంకర్, పశు వైద్యులు శంకర్ లింగం, భూమయ్య, విజయభారతి పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ పశువైద్యాధికారుల సంఘం జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కలెక్టర్ సంతోష్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమీ, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వై.రమేశ్ కుమార్, జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ ఈ.శంకర్, పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భూమయ్య, ప్రధాన కార్యదర్శి సరిత, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.శంకర్‌లింగం, కోశాధికారి డాక్టర్ శాంతిరేఖ, పశు వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి

మందమర్రిరూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు పూర్వ విద్యార్థులు అందించిన విరాళాలతో ఏర్పాటు చేసిన అప్పరెల్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో అనుభవజ్ఞులైన, అంకితభావంతో పనిచేసే అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. పాఠశాల పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలని సూచించారు. గతేడాది ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన జాహ్నవిని సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో జాడి పోచయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శశికళ, పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల వినతి

మంచిర్యాలటౌన్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు బుధవారం వినతిపత్రంను అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తొట్ల మల్లేశ్, కార్యదర్శి గోపతి సత్తయ్య, కామెర వెంకటస్వామి, సంతోష్, రాజబాబు, గొర్రె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లా పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మంజూరైన పనులకు అనుమతులు పొందిన వెంటనే కూలీలకు పని కల్పించాలని తెలిపారు. కొనసాగుతున్న పనుల పురోగతి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్హులైన కూలీలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధన దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బ్యాంకు అధికారులతో సమావేశాలను నిర్వహించి ఎన్‌పీఏపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్త్రీనిధి పథకం కింద మహిళల అభ్యున్నతి కోసం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, డీఆర్డీవో పీడీ బి.శేషాద్రి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ బదావత్ సంతోష్

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈగం మారయ్య, స్థానిక కౌన్సిలర్ సురిమిల్ల వేణు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ.యాకూబ్, పీఈటీలు శ్రీధర్, సంతోష్, భాస్కర్, ర్యూన్సీ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్లుప్తంగా

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఎస్సై వసంత్‌రావు, సిబ్బంది

భీమారం: నెన్నెల మండలం కొత్తూరు నుంచి భీమారం మండలం బూర్గుపల్లి వైపు బైక్‌పై గుడుంబా తరలిస్తున్న ఇస్లావత్ సంతోష్ నాయక్‌ని ఎస్సై వసంత్‌రావు సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి నాలుగు లీటర్ల గుడుంబాతో పాటు బైక్ స్వాధీనపర్చుకున్నట్లు మంచిర్యాల ఎక్సైజ్ శాఖ సీఐ నరేందర్ బుధవారం తెలిపారు. గుడుంబా తరలిస్తున్నారనే సమాచారంతో భీమారం–నెన్నెల రహదారిలో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడితో టాస్క్‌ఫోర్స్ అధికారులు

జన్నారం: టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి విక్రేత పట్టుపడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జన్నారం మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్, ఎస్సై మధుసుదన్‌రావు పానకల్ ప్రాంతంలో తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న నేతుల నాగరాజు అనే యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 218 గ్రాముల గంజాయి లభించింది. అతడిని విచారించ గాలాతోర్ గ్రామానికి చెందిన పటేల్ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇక్కడ అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. నాగరాజుతో పాటు పటేల్‌పై కేసు నమోదు చేశారు. నాగరాజును విచారణ నిమిత్తం జన్నారం పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. ఈ దాడులలో జన్నారం ఎస్సై తానాజీ నాయక్, సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



బ్రహ్మానందం మృతదేహం

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన తిప్పాటి బ్రహ్మానందం(45) ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పట్టణ ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బ్రహ్మానందం వడ్రంగి పనిచేసుకుంటూ భార్య నాగమని ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తున్నాడు. బుధవారం తన ఇంట్లోని గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అయితే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా తాడు తెగి కిందపడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మృతుడి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీలో అద్దె బస్సుల హవా

- ఏటా పెరుగుతున్న సంఖ్య
- తగ్గుతున్న ఆర్టీసీ సంస్థ సర్వీసులు
- ఆందోళనలో ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సుల సంఖ్య పెరిగిపోతున్నాయి. సంస్థ కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా.. పాత బస్సులు నడపలేక అద్దె బస్సులకు ప్రాధాన్యతనిస్తోంది. నిన్నమొన్నటి వరకూ నామమాత్రంగా ఉన్న హైర్ బస్సులు దాదాపు సగానికి సగం చేరాయి. కొత్త బస్సులు కొనుగోలు.. నూతన నియామకాలు చేపట్టకపోవటంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. మరో వైపు ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్రం తీసుకువచ్చే నూతన వాహన చట్టం ప్రకారం 15ఏళ్ల దాటిన బస్సులు తప్పనిసరిగా తుక్కుగా మార్చకతప్పదు. ఈ లెక్కన మరో 10 బస్సులు తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువ కాలం తిరిగిన బస్సుల్లో లగ్జరీ ఉన్నాయి. వీటి స్థానంలో ఇప్పటికే 19 బస్సులు రాగా పల్లెవెలుగు స్థానంలో 19 అద్దెబస్సులకు అనుమతిచ్చారు. ఉన్నతాధికారుల నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తే రాకపోకలు సాగిస్తున్న పాత బస్సులకు బ్రేక్‌లు పడే అవకాశాలున్నాయి.

పెరుగుతున్న అద్దె బస్సులు..

ఆర్టీసీ అద్దెబస్సులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఐదేళ్ల కిందట వరకు 146 బస్సులుండగా ఇందులో 93 ఆర్టీసీ, 53 అద్దెబస్సులున్నాయి. లాక్‌డౌన్ సెకండ్ వేవ్ అంక్షలు ఎత్తివేసేవరకు డిపోలో 142 బస్సులు కాగా 81 ఆర్టీసీ సంస్థకు చెందిన బస్సులు కాగా 61 అద్దె బస్సులున్నాయి. ప్రస్తుతం 142 బస్సుల్లో 73 ఆర్టీసీ బస్సులు కాగా 69 అద్దె బస్సులు చేరాయి. సంస్థ కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవటం.. కాలం చెల్లిన బస్సుల స్థానంలో అద్దె బస్సులు తప్పనిసరిగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో అంతకంతకు అద్దెబస్సులు పెరిగిపోయాయి. ఇంకో మూడు, నాలుగు బస్సులు అటు ఇటైనా సగం దాటిపోయినట్లే.



ఆర్టీసీ లగ్జరీ బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు (ఫైల్)



అద్దె బస్సు ప్రారంభోత్సవంలో అధికారులు (ఫైల్)

తగ్గుతున్న సిబ్బంది..

అద్దె బస్సులు పెరిగిపోతుండగా ఆర్టీసీ బస్సులపై విధులు నిర్వహించే కండక్టర్లు, డ్రైవర్ల సంఖ్య తగ్గిపోతోంది. అద్దె బస్సుల్లో సంస్థ నుంచి కండక్టరు మాత్రమే ఉంటాడు. డ్రైవర్లు ప్రైవేట్ బస్సుల యజమాన్యాలు సమకూర్చుకుంటాయి. సంస్థ బస్సులైతే ఇద్దరు ఉద్యోగులు అవసరం. వేతనాలు చెల్లింపులు, ఇతరత్రా కారణాల నేపథ్యంలో సంస్థ అద్దెబస్సుల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్సులు కాలక్రమేపీ తగ్గుముఖం పట్టడంతో 2017లో 225 మంది డ్రైవర్లు ఉండగా 264 మంది కండక్టర్లు ఉన్నారు. 2022 సంవత్సరం నాటికి డ్రైవర్లు 196, 254 కండక్టర్లు పడిపోయింది. ప్రస్తుతం 193 డ్రైవర్లు ఉంటే కండక్టర్ల సంఖ్య 231కు తగ్గుముఖం పట్టింది. ఈలెక్కన గతేడాదితో పోల్చితే ముగ్గురు డ్రైవర్లు, 23 కండక్టర్లు తగ్గిపోయారు. నూతన నియామకాలు చేపట్టకపోవడం ఓ కారణమైతే.. బదిలీపై వెళ్లిపోవటం.. ఎస్వచ్ఛంద విరమణ పొందటం కూడా కార్మికుల సంఖ్య తగ్గిపోవడానికి తోడైంది. ఆర్టీసీ సంస్థ బస్సులు కొనుగోలు చేస్తే నూతన నియామకాలు చేపట్టాల్సి వస్తుందనే సాకుతోనే అద్దె బస్సులకు అవకాశం ఇస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అద్దె బస్సులు	
మంచిర్యాల	63
ఆదిలాబాద్	66
నిర్మల్	76
ఆసిఫాబాద్	32

కాలం చెల్లిన బస్సుల స్థానంలో..

మంచిర్యాల డిపోలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో నూతన బస్సులు వచ్చాయి. 19 బస్సులు కొత్తవి రాగా ఇక్కడి పాత బస్సులను హైదరాబాద్‌కు పంపించి సిటీ బస్సులుగా మార్పులు చేసి నడిపిస్తున్నారు. పల్లె వెలుగుల స్థానంలో మాత్రం సంస్థ బస్సులు కాకుండా 19 అద్దె బస్సులకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 18బస్సులు రాగా ఇంకో బస్సు రావాల్సి ఉంది. ఈ లెక్కన పాత బస్సులను మాత్రం తుక్కుగా మార్చేవీలుంది. ఉన్నతాధికారుల ఆదేశాలు రావాల్సి ఉందని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలుకింద పడి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా కాటారంకు చెందిన డోలీ రాకేష్ (18) గంగారంలోని మోడల్ కాలేజీలో ఇంటర్ చదువుకుంటున్నాడు. కళాశాలకు వెళ్తున్నానని తల్లి సమ్మక్కకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని శివారులో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సీఎస్‌ఎల్ సెలక్షన్ లిస్టును విడుదల చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఇటీవల నిర్వహించిన చార్జర్ ఆఫ్ సేఫ్టీ ల్యాంప్ పరీక్ష ఫలితాలను, సెలక్షన్ లిస్టును వెంటనే విడుదల చేయాలని హెచ్‌ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దీనిని జాప్యం చేయడంతో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సెలక్షన్ లిస్టును ప్రకటించకుండా అందులో సెలక్ట్ అయిన వారి పేర్లను నేరుగా గనులపై పంపించడం సరికాదన్నారు. వెంటనే లిస్టును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కడెం చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గూడెం లిఫ్ట్ ద్వారా కడెం చివకి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని రైతులు బుధవారం కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. 42 డిస్ట్రిబ్యూటరీ కాలువ పరిధిలోని హాజీపూర్ మండలంలోని రైతుల పొలాలకు సాగు నీరందక పంట పొలాలు ఎండి పోతున్నాయన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ చెరువులు కూడా ఎండిపోతున్నాయని తెలిపారు. కడెం 30, 31, 32 డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని కాలువలకు నీళ్లు రానివ్వడం లేదని పేర్కొన్నారు. మండలంలోని రైతాంగానికి పోలీస్ బందోబస్తు మధ్య 42వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా హాజీపూర్ మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంట పొలాలు కాపాడాలని, చెరువులు నింపాలని కోరారు. వినతిపత్ర అందించిన వారిలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, రైతు సభ్యులు బేర పోచం, దొమ్మాటి సత్తయ్య, దొమ్మటి బాపు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ

- హాథ్ సే హాథ్‌జోడో కార్యక్రమానికి వెళ్తున్నవారి అడ్డగింత
- పరస్పరం దాడి చేసుకున్న రెండువర్గాలు
- ముఖ్యనాయకులపైనా పిడి గుద్దులు
- జెండాల కర్రలతో కొట్టుకుని, పుచ్చకాయలు విసిరేసుకున్న శ్రేణులు
- ఓ నేత కారు అద్దాలు పగులగొట్టిన కార్యకర్తలు
- తాళ్లగురిజాల ఠాణాలో పరస్పరం ఫిర్యాదు

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు దాడులకు దారితీశాయి. బెల్లంపల్లిలో ఆ పార్టీలోని రెండు వర్గాల శ్రేణులు బుధవారం రెచ్చిపోయారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. జెండా కర్రలు, పుచ్చకాయలతో కలబడ్డారు. ముష్టిఘాతాలకు దిగి, పిడి గుద్దులతో రణరంగాన్ని తలపించారు. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో ఓ వర్గం నాయకులు హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ముగ్గురు నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ కార్యక్రమం తర్వాత టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ , జిల్లా సీనియర్ నాయకుడు కేవీ.ప్రతాప్, మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు తదితరులు వాహనాల్లో బట్వాన్‌పల్లికి బయల్దేరారు. మరో వర్గం నాయకులు కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీశ్, రొడ్డ శ్యామ్, అనుబంధ సంఘాల నాయకులు రోహిత్, ఆకాశ్ తదితరులు పోచమ్మగడ్డ చౌరస్తా వద్ద మాటువేసి అడ్డుకున్నారు. వాహనాలను ఆపిన వెంటనే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్‌తో వాగ్వివాదానికి దిగారు. డీసీసీ అధ్యక్షురాలికి సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేసిన ముగ్గురిని తిరిగి పార్టీలోకి ఎలా చేర్చుకున్నారని నిలదీశారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం టీపీసీసీ పిలుపు మేరకు నియోజకవర్గంలో నిర్వహిస్తుండగా పోటీగా మరో కార్యక్రమం నిర్వహించడమేంటని ప్రశ్నించారు. దీంతో రెండు వర్గాలమధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది.



వాగ్వాదం చేసుకుంటున్న ఇరువర్గాలు

ముష్టిఘాతాలతో బాహాబాహీ...

రెండు వర్గాలు పట్టుదలకు పోవడంతో శ్రేణులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. ఓవర్గం శ్రేణులు చేతికందిన వస్తువులతో ప్రత్యర్థివర్గం నాయకులపై విచక్షణ రహితంగా దాడిచేశారు. పార్టీ జెండాల కర్రలతో కొట్టుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న పుచ్చకాయలు విసురుకున్నారు. కొందరు ఓ వర్గం నాయకుడి కారు అద్దాలు పగులగొట్టి, అతడిపై పిడి గుద్దులు గుద్దారు. దొరికిన వారిని దొరికినట్లుగా చితకబాదడంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఈ క్రమంలోనే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మరి కొందరు నాయకులు కారులో అక్కడి నుంచి చాకచక్యంగా బయటపడి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, ఆయన వర్గం నాయకులు సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదు స్వీకరించిన తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్ పలువురిపై కేసు నమోదు చేశారు.

గ్రూపులను ప్రోత్సహించి దాడి చేయించారు

బెల్లంపల్లి: టీపీసీసీ ప్రధానకార్యదర్శి గోమాస శ్రీనివాస్ పార్టీలో గ్రూపులను ప్రోత్సహించి ప్రత్యర్థి వర్గం నాయకులపై దాడులు చేయిస్తున్నారని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండి ప్రభాకర్, బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీశ్ కుమార్ విమర్శించారు. బుధవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కుమ్మక్కై సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే దాడి చేయించడం దారుణమన్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి పాటుపడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారదలపై గోమాస శ్రీనివాస్ తనవెంట తెచ్చుకున్న వ్యక్తులతో దాడులు చేయించారని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గంలో శ్రీనివాస్ గ్రూపులను ప్రోత్సహిస్తూ కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావులకు కనీస సమాచారం ఇవ్వకుండా రాష్ట్రనాయకులు బెల్లంపల్లిలో ఎలా అడుగు పెట్టారని ప్రశ్నించారు. ఈనెల 6వ తేదీ నుంచి పట్టణంలో హాథ్‌సే హాథ్ జోడో పాదయాత్ర జరుగుతుండగా గోమాస శ్రీనివాస్, కేవీ ప్రతాప్ బెల్లంపల్లికి ఎందుకు రాలేదని పేర్కొన్నారు. సమావేశంలో తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరం దామోదర్ రెడ్డి ,నాయకులు రేగుంట రాజలింగు , రోహిత్, ఎలుక ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి ప్రభాకర్

ఆర్కే 6 గనిలో రక్షణ చర్యలపై తనిఖీ



సేఫ్టీ తనిఖీకి గనిలోకి వెళ్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గనిలో రక్షణ చర్యలను మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారి ఓదెలు తనిఖీ చేశారు. సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా బుధవారం ఈ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గనిలో దిగి పంపింగ్ సిస్టం, ఎయిర్ కంప్రెషర్, ఎస్‌డీయల్ యంత్రాలను పరిశీలించారు. ఇక్కడ రక్షణ చర్యలు పరిశీలించారు. రక్షణ పట్ల ఎప్పుడు జాగ్రత్తలోఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ ఈ తిరుపతి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, ఇంజనీర్ మహేశ్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

స్టోర్స్ జీఎం పరిశీలన..

ఆర్కే 6 గనిలో ఫిట్ స్టోర్‌ను కంపెనీ స్టోర్స్ జీఎం బసవరెడ్డి పరిశీలించారు. స్టోర్స్‌లో రికార్డులను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేశ్ బాబు, స్టోర్స్ డీజీఎం సోమశేఖర్‌లు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన యువతి (20) అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... మంగళవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు అంతా పడుకుని ఉదయం లేచేసరికి యువతి కనిపించలేదు. బుధవారం కుటుంబ సభ్యులు ఆమె కోసం బంధువుల ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్ట్ పేరుతో బెదిరింపులు

- రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్

నస్పూర్: మావోయిస్ట్ పేరుతో డబ్బులు కావాలని ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సీసీసీ నస్పూర్‌కు చెందిన గుండా కాంతయ్యకు ఓ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఫోన్ చేశాడు. దీంతో కాంతయ్య కుమారుడు నాగరాజు ఆ ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడాడు. రూ.30లక్షలు కావాలని, లేకుంటే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆందోళనకు గురైన నాగరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. కాగా కాంతయ్య రెండు నెలల క్రితం లక్సెట్టిపేట మండలంలోని ఇటిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో తన భూమిని విక్రయించగా సుమారు కోటి రూపాయల వరకు వచ్చినట్లు సమాచారం.

నేడు అత్యవసర సమావేశం

- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా దర్బార్‌లో గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచ్చయ్య, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగోబా దర్బార్‌లో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని 9 తెగల కుల సంఘాలు, ఆదివాసీ సంఘాలు, రాయిసెంటర్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మేధావులు, సలహాదారులు హాజరు కావాలని కోరారు. అలాగే తుడుందెబ్బ అదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లా, డివిజన్, మండల కమిటీలతో పాటు సంఘ సభ్యులు, బాధ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, కార్యదర్శి సోయం రాందాస్, మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయికే ఇంద్ర, విద్యార్థి సంఘం నాయకుడు సలాం వరుణ్, నాయకులు జంగు, సిడాం లక్ష్మణ్, పెందూర్ విలాస్, కుమ్ర వసంత్, కొడప మాధవ్‌రావ్, కుర్సేంగే తానాజీ, ఆత్రం గణపతి, మెడ్మ ముకుంద్ ఉన్నారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

'హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్'

చెన్నూర్‌రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని నాగాపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి కేంద్ర కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం ముంపు ప్రాంత రైతులను ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పీఎం మోదీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, చెన్నూర్ మండల పార్టీ అధ్యక్షుడు ఆలం బాపు, జైపూర్ మండల అధ్యక్షుడు నిజాంబాద్ రెడ్డి, మండల నాయకులు రఘునందన్ రెడ్డి, పోలు చంద్రాగౌడ్, గందు రాజు, చెన్నూర్ పట్టణ కార్యదర్శి చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకు ముందు మధ్యలో బీఆర్‌ఎస్ నాయకులు వివేక్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు తోపులాడుకున్నారు. చెన్నూర్ ఎస్సై మహేందర్ అక్కడకు చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.



మాట్లాడుతున్న వివేక్

ప్రాజెక్ట్ కరకట్టపై పూర్తయిన రోడ్డు



పనులకు ముందు కట్టపై రోడ్డు



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కరకట్టపై పూర్తయిన బీటీ రహదారి పనులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్, ప్రాజెక్ట్ పరిసరాలను అందంగా ముస్తాబు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ప్రాజెక్ట్ కరకట్టపై నెల రోజుల కిందట చేపట్టిన బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. నాలుగేళ్ల క్రితం మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులకు సంబంధించి టెండర్ దక్కించుకోగా 2019 ఫిబ్రవరిలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. అయితే పనులు ప్రారంభించినా ఇన్నాళ్లు నిధుల కేటాయించకపోవడంతో పనుల్లో జాప్యం నెలకొంది. దాదాపు రూ.8కోట్ల 98 లక్షల 50వేలతో ఈ బీటీ రోడ్డు పనులు చేపట్టగా ప్రస్తుతం ప్రాజెక్ట్ కరకట్టపై పూర్తయ్యాయి. ప్రాజెక్ట్ ఈఈ బండ విష్ణుప్రసాద్‌తో పాటు నీటిపారుదల శాఖా క్వాలిటీ కంట్రోల్ డీఈలు ప్రవీణ్‌కుమార్, బుచ్చిబాబు, ఏఈ నరేశ్‌లు పనుల నాణ్యతను పర్యవేక్షించారు. ప్రాజెక్ట్‌కు ఇరువైపులా కరకట్టపై బీటీ రోడ్డు పనులు పూర్తి కాగా త్వరలోనే చేపట్టనున్న జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు, రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ పనులతో ప్రాజెక్ట్ టూరిజంకు చిరునామాగా మారనుంది.



చేపల వేట...

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల ర్యాలీ ప్రాజెక్ట్ కాలువలో నీరు తగ్గడంతో ఇటుక బట్టిలో పనిచేసే యువకులు దోమ తెరలతో చేపల వేటలో మునిగిపోయారు. ఆ దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫోటోగ్రాఫర్, మంచిర్యాల